సాక్షి వనపర్తి

శుక్రవారం । 9 । మే । 2025



ఉత్సాహంగా కబడ్డీ శిక్షణ

పాలమూరులో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸



కళాకారులకు ఆదరణేదీ?

ప్రభుత్వాల ప్రోత్సాహం కరువై కళాకారులు వీధిన పడుతున్నారు.

వివరాలు 11లో ▸

గరిష్టం/కనిష్టం
40.2 /22.4

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీయడంతో పాటు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుల కోసం నైపుణ్యం గల చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య గురువారం కోరారు. చేనేత వృత్తిలో అత్యంత నైపుణ్యం కలిగి ఉండి 31.12.2024 నాటికి 30 ఏళ్లు నిండి పదేళ్లకు తగ్గకుండా అనుభవం ఉన్నవారు.. డిజైనింగ్ కేటగిరీలో 31.12.2024 నాటికి 25 ఏళ్లు నిండి ఐదేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల, నారాయణపేట, డ్రెస్, జనరల్ వెరైటీస్‌లో చీరల తయారీపై నైపుణ్యం ఉన్నవారు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన కార్మికులకు రూ.25 వేల నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందిస్తారని తెలిపారు.

ఐకేపీ సీసీ శోభకు రాష్ట్రస్థాయి పురస్కారం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం క్లస్టర్ సీసీగా పనిచేస్తున్న శోభకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారం లభించిందని ఏపీఎం రాంబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు సీసీల్లో జిల్లా నుంచి శోభ ఒక్కరే ఎంపికైనట్లు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా రాజన్ అవార్డును అందజేసినట్లు వివరించారు. దీన్‌దయాళ్ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకంలో భాగంగా ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు అందించే రుణాల్లో శోభ తన క్లస్టర్ పరిధిలోని ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి, గట్టుకాడిపల్లి, ఆగారం, అంతాయపల్లి, షాపురం గ్రామాల్లోని మహిళా సంఘాలకు రూ.11.50 కోట్ల రుణాలు ఇప్పించినట్లు వివరించారు. ఈ సందర్భంగా శోభను ఐకేపి సిబ్బంది, ఏపీఎంలు అభినందించారు.

యూరియా తక్కువగా వినియోగించాలి



వనపర్తి రూరల్: రైతులు తమ పంటలకు యూరియాను తక్కువగా వినియోగించాలని పాలెం వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరామ్ తెలిపారు. గురువారం మండలంలోని కిష్టగిరి గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని యూరియా వినియోగం, పంటమార్పిడి, సాగునీటి పొదుపు, నాణ్యమైన విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిలో సారం ఉండాలంటే రైతులు పంటల సాగుకు 40 రోజులు ముందుగానే పచ్చిరొట్ట పైర్లు వేసుకొని పూత దశలో కలియ దున్నాలని, దీంతో భూ సారం దెబ్బ తినకుండా ఉంటుందన్నారు. ముఖ్యంగా వరి, ఇతర పంటల కోతల అనంతరం కొయ్యలను తగలబెట్టరాదని సూచించారు. ఉద్యాన అధికారి శివతేజ మాట్లాడుతూ.. ఆహార పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పాం తోటలను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజారెడ్డి, ఉమా, మహేష్, మండల వ్యవసాయ అధికారి కురుమయ్య, ఏఈఓ యుగంధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు



వనపర్తి రూరల్: తాలు, మట్టి లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని రాజాపేట వరి కొనుగోలు కేంద్రం, కొత్తకోట మండలం అమడబాకుల లక్ష్మీనర్సింహ, పెబ్బేరు మండలం సప్తగిరి, లక్ష్మీవారాసి రైస్‌మిల్, శ్రీరంగాపురం మండలం కంభాళాపురంలోని రైస్‌మిల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మిల్లులో దొడ్డురకం వరి ధాన్యం 5 వేల బస్తాలు దించుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వచ్చిన లారీలను త్వరగా అన్‌లోడ్ చేసేలా హమాలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీని అందుబాటులో ఉంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు సూచించారు.

ప్రథమ చికిత్స.. ప్రశ్నార్థకం?



వనపర్తి బస్టాండ్‌లో ప్రమాదానికి గురైన బస్సు (ఫైల్)

ఆర్టీసీ బస్సుల్లో కానరాని కిట్లు
- కనీస మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులోని లేని వైనం
- పట్టించుకోని యంత్రాంగం



బస్సులో ఖాళీగా ఉన్న ప్రథమ చికిత్స కిట్ బాక్స్

వనపర్తిటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో బస్సుల్లో కనీసం ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. బస్సుల్లో గాయపడిన, వేసవి తాపానికి తట్టుకోలేక అస్వస్థతకు గురైన వారికి కనీస చికిత్స అందించేందుకు కూడా సౌకర్యాలు లేదు. చిన్నపాటి గాయమైన ప్రయాణికులు ఆస్పత్రులు, మందుల దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. అత్యవసర సమయంలో అవసరమయ్యే మందులు, వేసవిలో కనీసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం లేదు. వనపర్తి డిపో పరిధిలోని 108 బస్సులు రోజు వివిధ ప్రాంతాలకు 60 వేల మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తాయి. దీంతో ఆర్టీసీకి రోజుకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా.. ప్రయాణికుల అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను కూడా అధికారులు సమకూర్చలేకపోతున్నారు. కొన్ని బస్సుల్లో పెట్టెలు కనిపిస్తున్నా వాటిలో మందులు లేవు. సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెల స్థానంలో టీవీలు, టేప్‌రికార్డులు బిగించగా.. మరికొన్నింటిలో ఖాళీగా ఉంచారు. కొంతకాలం కింద జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో బస్సు చెట్టును ఢీకొట్టగా డ్రైవర్, ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

పెట్టెలో ఉండాల్సినవి..

దూది, బ్యాండేజ్ క్లాత్, ఆయింట్‌మెంట్, గాయం శుభ్రం చేసేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్, నార్మల్ సెలైన్ తప్పనిసరిగా ఉండాలి. వీటికి అదనంగా పారాసిటమాల్ మాత్రలు, వేసవిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాల్సి ఉంటుంది. డిపోలో ఉన్న బస్సులో చాలా వరకు ప్రథమ చికిత్స పెట్టెలు లేవు. మరికొన్నింట్లో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కొత్తగా బస్సులు వచ్చినప్పుడే ప్రథమ చికిత్స పెట్టెలో మందులు ఉంటాయని సిబ్బంది పేర్కొంటున్నారు. అద్దె బస్సుల్లో సైతం ఈ పెట్టెలు ఉండటం లేదు.

శిక్షణ కరువు..

బస్‌డ్రైవర్లు, కండక్టర్లకు ప్రథమ చికిత్సపై కనీస అవగాహన కల్పిస్తున్న దాఖలాలు ఎక్కడా లేవు. ప్రథమ చికిత్స పెట్టెలో మందులు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తేగాని సమకూర్చరని సిబ్బంది చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధుల కేటాయింపు కూడా అవసరం.

> **కొత్త బస్సుల్లో..**
> నిబంధనల ప్రకారం ప్రతి బస్సులో ప్రథమ చికిత్స కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలి. కొత్తగా వచ్చిన బస్సుల్లో తొలినాళ్లలో కిట్లు ఉంటున్నాయి. బస్సుల్లో పెద్దగా అవసరం పడటం లేదు. మందులు ఎత్తుకెళ్తున్నారు.. అందుకే పెద్దగా పట్టించుకోవడం లేదు.
> – వేణుగోపాల్, ఆర్టీసీ డీఎం, వనపర్తి

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

వనపర్తి విద్యావిభాగం: పత్రికా స్వేచ్ఛను హరించేలా సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఏపీ పోలీసులు అమానుషంగా దాడులు చేయడాన్ని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. గురువారం సురవరం ప్రతాపరెడ్డి వనపర్తి ప్రెస్‌క్లబ్ (కమిటీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో విలేకరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రెస్‌క్లబ్ నాయకులు తప్పుబట్టారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ చర్యపై న్యాయవ్యవస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్పందించాలని డిమాండ్ చేశారు. తనిఖీల పేరుతో వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం హేయమైన చర్యగా నేతలు అభివర్ణించారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజెప్పే స్వేచ్ఛ పత్రికలకు ఉందని.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఎదురుకావద్దని ఆకాంక్షించారు. తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారన్న దురుద్దేశంతో ఏపీ పోలీసులతో అక్రమంగా కేసులు నమోదు చేయించడం, వారి వ్యక్తిగత వ్యాపార సంస్థలు, ఇళ్లపై దాడులు నిర్వహించడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు బోలెమోని రమేష్, రాజు, కొండన్న యాదవ్, శ్రీనాథ్, తరుణ్, శ్రీనివాస్‌గౌడ్, పురుషోత్తం, గోపాలకృష్ణ యాదవ్, అంజి, యూసుఫ్, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

వేగంగా సంక్షేమ పథకాల అమలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పుర కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, ఉపాధిహామీ పథకం, వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. జనవరి 26న ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని 1,300 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు గ్రౌండింగ్ పూర్తయినవి.. మిగిలినవి పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలు మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎవరైతే ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదో వారితో ఇష్టం లేదని రాతపూర్వకంగా లేఖలు తీసుకోవాలని.. వారి స్థానంలో ఇతరులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండోవిడతలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్క్రూటినీ చేసిన జాబితాను తన లాగిన్‌కు త్వరగా పంపించాలన్నారు. వివిధ సంక్షేమ శాఖలకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను బ్యాంకులకు అందజేయాలని, ఈ ప్రక్రియ 15వ తేదీగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు 15 లక్షల పనిదినాలు కల్పించేందుకు లక్ష్యంగా నిర్దేశించామని.. ఇప్పటి వరకు కేవలం 2.60 లక్షల పని దినాలు మాత్రమే కల్పించామని, ఇప్పుడు రోజుకు 40 వేల పని దినాలు కల్పిస్తే తప్ప లక్ష్యాన్ని చేరుకోలేమని చెప్పారు. గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించి అత్యధికంగా కార్మికుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు అవకాశం ఉంటుందని, వచ్చే వన మహోత్సవంలో ప్రతి గ్రామ రహదారికి ఇరువైపులా 6 అడుగుల ఎత్తుగల మొక్కలు నాటాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో దోమలతో డెంగీ, మలేరియా, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ప్రతి నెల 1, 11, 21 తేదీల్లో శుభ్రం చేసేలా చూడాలని, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) అంశంగా కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు, ఐటీఐలో డ్రాఫ్ట్ మెన్ సివిల్, డిప్లొమా ఇన్ సివిల్, బీటెక్ సివిల్, ఇతర సమానమైన విద్యార్హత కలిగి వారు అర్హులని.. మీ–సేవ కేంద్రాల్లో ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణ ఫీజు ఓసీలు రూ. వేలు, బీసీలు రూ.ఐదు వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని.. ఎంపికైన వారికి జిల్లాకేంద్రంలో 50 పని దినాల్లో తెలంగాణ అకాడమీ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 98490 81489, 94419 47339 సంప్రదించాలని సూచించారు.

సాగునీటి రంగం పటిష్టతకు కృషి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: నియోజకవర్గంలోని గొల్లపల్లి, బుద్దారం రిజర్వాయర్లు, చెరువులు, చెక్ డ్యాములు, కాల్వల మరమ్మతుకు రూ.1,323 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని నీటిపారుదలశాఖ సీఈ కార్యాలయంలో ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం ఆన్‌లైన్ రిజర్వాయర్, కేఎల్‌ఐ, డి–5, డి–8 కాల్వల పటిష్టత, విస్తరణ, స్ట్రక్చర్ల ఏర్పాటు, డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్, బుద్ధారం కుడి, ఎడమ కాల్వల పటిష్టత, గణపురం బ్రాంచ్ కెనాల్, కర్నె తండా, ఖాసీంనగర్ ఎత్తిపోతలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలోనే చెరువులు, కుంటలు, చెక్ డ్యాముల నిర్మాణాలు మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ సీఈ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు కేశవరావు, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటా రూ.2,123

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యంధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,123, కనిష్టంగా రూ.1,779గా ధరలు నమోదయ్యాయి. అలాగే హంస ధాన్యం గరిష్టంగా రూ.1,810, కనిష్టంగా రూ.1,509, ఆముదాలు సరాసరిగా రూ.5,858 ఒకే ధర లభించింది. మార్కెట్‌కు దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

'పాలీసెట్'కు ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 13న పాలీసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 3,381 మంది విద్యార్థులు హాజరవుతారని, మొత్తం 5 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

గ్రామ పాలనపై అవగాహన తప్పనిసరి

వనపర్తి: పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ పాలన, సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మండలానికి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల శిక్షణ కొనసాగుతుండగా.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్రని తెలిపారు. రెండ్రోజుల పాటు నిర్వహించే నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామసభలు ఎలా నిర్వహించాలి.. చర్చించాల్సిన అంశాలు.. సంస్కరణల అమలు గురించి వివరించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉంటే ప్రజా ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విశ్రాంత డీపీఓ కృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ డా. హన్మంతు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య

అన్నదాతలపై ఆర్థిక భారం

వ్యవసాయ యంత్రాలకు చేయూత కరువు
- మహిళా రైతులకు 50, ఇతరులకు 40 శాతం రాయితీ పరికరాలు
- ఆర్థిక సంవత్సరం ముగియడంతో లబ్ధిదారుల ఎంపికకు బ్రేక్
- 2018 నుంచి నిధులు కేటాయించని వైనం
- వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం



ట్రాక్టర్‌తో కరిగెట దున్నుతున్న ఓ రైతు

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాల ఉప ప్రణాళిక పథకం కింద రైతులకు వ్యవసాయ పరికరాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ప్రతి జిల్లాకు వివిధ రకాల పరికరాలను అందించేందుకు గాను నిధులు మంజూరు చేస్తుంది. మార్చి 21న ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా.. 2024– 25 ఆర్థిక సంవత్సరం ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాకు 1,341 యూనిట్లకు గాను రూ.3,30,53,000 నిధులు మంజూరయ్యాయి. మహిళా రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతంపై వీటి ఇవ్వాలని సూచించారు. తక్కువ సమయం ఉండటంతో ప్రచారం కల్పించలేకపోయారు. దీనిపై ఇప్పటికే వ్యవసాయాధికారులు దరఖాస్తులు స్వీకరణలో జాప్యంతో లబ్ధిదారుల ఎంపిక ఆలస్యమైంది. ఈలోగా మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియడంతో మంజూరైన నిధులను వినియోగించలేకపోయారు. దీంతో 2025– 26 కొత్త ఆర్థిక సంవత్సరంలో వీటిని అమలు చేస్తారా.. లేదా.. అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సం కింద నిధులు, దరఖాస్తుల స్వీకరణకు గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక పంపించారు.

అందించే పరికరాలు ఇవే..

రైతులకు ఎక్కువగా ఉపయోగపడే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నియోజకవర్గానికి ఒక ట్రాక్టర్ మంజూరు చేశారు. చేతి పంపులు, తైవాన్ పంపులు, డ్రోన్లు, రొటోవేటర్లు, విత్తనాలు నాటే మిషన్లు, కేజీ వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడ్డికోసే యంత్రాలు, పవర్ ట్రిల్లర్లు, ట్రాక్టర్లు, మొక్కజొన్న పట్టే యంత్రాలు, పత్తిని మూటకట్టే పరికరాలు ఇవ్వనున్నారు. కేజీ వీల్స్, తైవాన్ పంపులు, రొటోవేటర్లు, చేతిపంపులు ఎక్కువగా మంజూరయ్యాయి. ఎంపిక చేసిన రైతులు సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులు డీడీ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

ఏడేళ్ల తర్వాత..

వ్యవసాయానికి సంబంధించి ఐదేళ్లుగా వాతావరణం అనుకూలిస్తున్నా.. అన్నదాతలకు ప్రభుత్వం సాయం కరువైంది. ఏడేళ్లుగా యంత్ర సాయం లేకపోవడంతో అన్నదాతలకు ఎదురుచూపులే మిగిలాయి. 2017 వరకు ఏటా వానాకాలంలో రాయితీ పరికరాలను అందించగా తర్వాత నిలిపివేయడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరిస్తామని, రూ.150 కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

ఖర్చులు, సమయం ఆదా..

కూలీ ఖర్చులతోపాటు సమయాన్ని ఆదా చేసుకోవాలని రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఏటా యంత్రాల కోసం దరఖాస్తు చేయడం.. ఎదురుచూడటం పరిపాటిగా మారింది. ప్రతి సంవత్సరం మార్చి నెల గడువు కాగా.. కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ల వారీగా ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను మండలాలకు కేటాయించడం తదుపరి మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరించడం.. అనంతరం జిల్లా కమిటీ ద్వారా ఆమోదం తెలిపి, కలెక్టర్ అనుమతితో రైతులకు అందజేయాలి. కాగా.. జిల్లాకు 2014– 15లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో మంజూరు చేయగా.. 2016 నుంచి మాత్రం కేటాయింపులు ఒక రకంగా మంజూరు మరో రకంగా ఉంటోంది. మూడు నెలలకోసారి నాలుగు విడతల్లో నిధులిచ్చే ప్రక్రియ ఊసేలేదు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన నిధులు, యూనిట్లు ఇలా..

జిల్లా	నిధులు (రూ.లక్షల్లో)	యూనిట్లు
నాగర్‌కర్నూల్	86.31	365
నారాయణపేట	73.85	310
మహబూబ్‌నగర్	71.02	252
జోగులాంబ గద్వాల	56.88	236
వనపర్తి	42.47	178

2016లో తొలి విడత..

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగమైన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన తొమ్మిదేళ్లుగా అటకెక్కింది. 2016లో తొలి విడత నిధులు కేటాయించగా.. తదుపరి కార్యాచరణ కరువైంది. ఈ పథకానికి రూ.5 కోట్లు కేటాయించి, రైతులకు పరికరాలు, అద్దె ప్రాతిపదికన యంత్రాలను ఇచ్చేవారు. ఏళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రెన్యువల్‌కు రాశాం..



కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు రూ.86 లక్షలు మంజూరయ్యాయి. ఆర్థిక సంవత్సరం చివరలో నిధులు రావడంతో సమయానికి లబ్ధిదారుల ఎంపిక చేయలేదు. దీంతో ప్రస్తుత 2025– 26 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చేందుకు కేంద్రానికి రెన్యువల్ కోసం లేఖ రాశాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని పునరుద్ధరించి నిధులు ఇస్తామని ప్రకటించింది.
– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి, నాగర్‌కర్నూల్

రాయితీపై ట్రాక్టర్లు ఇవ్వాలి..



గతంలో రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు ఇచ్చేవారు. కొన్నేళ్లుగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు ఇస్తే అన్నదాతలకు ఎంతో ఊరట కలుగుతోంది. పంటల సాగుకు ఖర్చు తగ్గుతుంది.
– కదిరే కృష్ణయ్య, రైతు, ఉప్పునుంతల

దున్నడానికే రూ.11 వేలు..



ఏటా సాగు ఖర్చు పెరుగుతోంది. ట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఎద్దులతో చేద్దామంటే వాటిని మేపేందుకు మేత లేదు. ఎకరా సాగుకు రూ.25 వేల పెట్టుబడి అయితే అందులో రూ.11 వేలు దున్నడానికే పోతోంది.
– పుల్యానాయక్, రైతు, గుట్టమీది తండా

క్లుప్తంగా

పోలేపల్లిలో బాలిక ఆత్మహత్య

జడ్చర్ల టౌన్: మనస్తాపంతో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ కమలాకర్ వెల్లడించిన వివరాలిలా.. మండలంలోని పోలేపల్లి గ్రామానికి ఎట్టి విష్ణు ఏడాదికాలంగా అదే గ్రామానికి చెందిన బాలిక(15)ను ప్రేమిస్తున్నానని వెంట పడేవాడు. ఈ విషయమై బాలిక కుటుంబ సభ్యులు సదరు యువకుడికి నచ్చచెప్పినా వినలేదు. అయితే గురువారం ఉదయం విష్ణు తల్లి బాలిక ఇంటికి వచ్చి ఆమె తల్లిని దూషించి.. మీ అమ్మాయిని మా అబ్బాయితో మాట్లాడవద్దని, భయం చెప్పుకోండని తనపై చేయి చేసుకుందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో తల్లిపై చేయి చేసుకోవడం చూసిన బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


జీత్యానాయక్ (ఫైల్)

మద్దూరు: పాముకాటు వేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పల్లెగడ్డతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన జీత్యానాయక్(54) గురువారం తన మేకలకు మేత కోసుకురావడానికి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పాముకాటు వేసింది. ఏదో పురుగు కరిచిందని నిర్లక్ష్యం చేయడంతో మృతిచెందినట్లు భార్య చంద్రిబాయి తెలిపారు.

భర్తకు నిప్పంటించిన భార్య

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో భర్తకు భార్య నిప్పంటించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న భర్త చింతకుంట రాములుపై మద్యం మత్తులోనే ఉన్న భార్య తిరుపతమ్మ పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీంతో భర్త హాహాకారాలు చేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పారు. అయితే అప్పటికే సగం కాలిపోవడంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఈ విషయం గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

గద్వాల క్రైం: వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారని గద్వాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపారు. వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి చెందిన బోయ కృష్ణమనాయుడు(35) బుధవారం గద్వాల మండలం మేళచెర్వులో నిర్వహించిన గ్రామ దేవత ఉత్సవాల నిమిత్తం బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో రాత్రి బహిర్భూమి కోసం రైల్వే ట్రాక్ సమీపంలోకి వెళ్లాడు. తిరిగి రైలు పట్టాలపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కృష్ణమనాయుడి తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

➪ గద్వాల పట్టణంలోని బీసీకాలనీకి చెందిన ఎరుకలి శ్రీను(22) కొంతకాలంగా తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. అయితే తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదని గురువారం మధ్యాహ్నం గద్వాల–రాయిచూర్ వెళ్లే మార్గంలో గుర్తుతెలియని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై శ్రీను తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి


నారాయణ(ఫైల్)

ఎర్రవల్లి: మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్‌పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. ఇటిక్యాల మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన నారాయణ (30) కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా తిరిగేవాడు. ఈ క్రమంలో బుధవారం ఎర్రవల్లి మండలకేంద్రంలో జరిగిన దేవర కార్యక్రమానికి వచ్చిన ఆయన మద్యం సేవించాడు. కాగా.. కూడలిలోని ఓ కాంప్లెక్స్ వద్ద రాత్రి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు.గురువారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరోజతో పాటు ఓ కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ శిక్షణ


జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మ్యాట్‌పై కబడ్డీ ప్రాక్టిస్ చేస్తున్న క్రీడాకారులు

- పాలమూరులో రెండోసారి మ్యాట్‌పై ప్రత్యేక శిక్షణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా తర్ఫీదు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కబడ్డీ క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవలేదు. కొన్నేళ్ల నుంచి జిల్లా కబడ్డీ జట్లు మెరుగైన ఆటతీరుతో రాష్ట్రస్థాయి టోర్నీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. క్రీడాకారులకు వెన్నుదన్నుగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిలుస్తోంది. ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సహిస్తూ వారిని మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతోంది.

➪ ఈ ఏడాది జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో మ్యాట్‌పై ఆడుతారు. దీని దృష్టిలో పెట్టుకొని మ్యాట్‌పై ప్రత్యేక కబడ్డీ శిక్షణ అందజేస్తున్నారు. మ్యాట్‌పై క్రీడాకారులు మెరుగ్గా ఆడేలా వారికి తర్ఫీదిస్తున్నారు. వేసవిశిబిరంలో 45 నుంచి 50 మంది యువత కబడ్డీలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈనెలాఖరు వరకు వేసవి కబడ్డీ శిబిరం కొనసాగనుంది. ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక కబడ్డీ శిక్షణ అందజేస్తున్నారు. శిబిరంలో కురుమూర్తిగౌడ్, ఆర్.శ్రీనివాసులు, పాపారాయుడు, గణేష్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ భోజన వసతి ఏర్పాటు చేసింది.

అందరి సహకారంతో వేసవి శిక్షణ శిబిరం



జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో వేసవి ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. క్రీడాకారులు మ్యాట్‌పై ఆడాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా శిక్షణ అందజేస్తున్నాం. శిబిరం నిర్వహణకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతి కుమార్ సహకారం ఎంతో ఉంది. గతేడాది నిర్వహించిన వేసవి శిబిరంలో చాలా మంది క్రీడాకారులు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొని ప్రతిభచాటారు.

– ఈ.కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

ప్రోకబడ్డీతో ప్రాధాన్యత ఏర్పడింది



ప్రోకబడ్డీ లీగ్‌తో గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. నైపుణ్యం గల కబడ్డీ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తాం. ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటాలి. జిల్లా కబడ్డీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలి.

– దామోదర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు, మహబూబ్‌నగర్

రెండోసారి వేసవిలో శిక్షణ..



రెండోసారి జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వేసవిలో కబడ్డీ శిక్షణ తీసుకుంటున్న. రెండుసార్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాను. జాతీయస్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ఆడాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్న. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా. వేసవి శిబిరంలో మ్యాట్‌పై శిక్షణ చాలా బాగుంది.

– గౌతమ్, నవాబ్‌పేట

రెండేళ్ల నుంచి ఆడుతున్నా..



రెండేళ్ల నుంచి కబడ్డీ ఆడుతున్న. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో ఆడాను. భవిష్యత్‌లో కబడ్డీలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఆడి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నదే లక్ష్యం.

– కార్తీక్, రాజాపూర్ (తిరుమలాపూర్)

ప్రో-కబడ్డీ లీగ్‌లో ఆడుతా..



కబడ్డీ అంటే చాలా ఇష్టం. ప్రోకబడ్డీ లీగ్‌లో ఆడాలని ఉంది. రెండుసార్లు అంతర్ జిల్లా టోర్నీల్లో ఆడాను. భవిష్యత్‌లో ఇండియా తరపున అంతర్జాతీయ మ్యాచుల్లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న. ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటా.

– చందు శ్యామ్‌గడ్డతండా

మ్యాట్‌పై శిక్షణ చాలా బాగుంది



వేసవి శిబిరంలో మ్యాట్‌పై శిక్షణ ఇస్తుండడం చాలా బాగుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న. నా ఆటలో తప్పులను సరిదిద్దుకుంటున్న. నా ఆటను ఇంకా మెరుగుపరుచుకొని జాతీయస్థాయిలో రాణిస్తా. టీమిండియా జట్టుకు ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నా.

– వినయ్, అడ్డాకుల

ముఖచిత్ర గుర్తింపు జిల్లాలోనే చేపట్టాలి

ఆర్ఎం రిటైర్డ్ ఉద్యోగుల వినతి


ఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ హాస్పిటల్‌లో చేపట్టిన ముఖచిత్రం గుర్తింపు, (ఫేస్ వెరిఫికేషన్) బొటన వేలిముద్రల ప్రక్రియను మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆర్టీసీ క్లీనిక్‌లలో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షులు రాజసింహుడు, ఉపాధ్యక్షులు బీబీపాల్ గురువారం ఆర్ఎం సంతోష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగ భార్య, భర్త వైద్య చికిత్సల కోసం వారి ముఖచిత్రాలు, బొటన వేలు ముద్రలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసేందుకు తార్నాక రావాలని యాజమాన్యం సూచించిందని, వయోవృద్ధులైన విశ్రాంత ఉద్యోగులు అనేకమంది అనారోగ్యంతో హైదరాబాద్‌కు రాలేనిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ క్లీనిక్‌లలో చేపట్టాలని ఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ మెడికల్ అధికారికి సన్మానం

ఆర్టీసీ మెడికల్ అధికారిగా డాక్టర్ సుజాత నూతనంగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రమాకాంత్ హైదరాబాద్ తార్నాక ఆస్పత్రికి బదిలీ అయ్యారు. గురువారం డాక్టర్ సుజాతను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం నాయకులు శాలువాతో సత్కరించారు. క్లీనిక్‌లో మందుల కొరత లేకుండా రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీలకు 453 మంది ఇంజినీరింగ్ అధికారులు

- అసెంబ్లీలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానం

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలో మున్సిపాలిటీలకు కొత్తగా 453 మంది ఇంజినీరింగ్ అధికారుల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గురువారం వెల్లడించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తాను అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం నుంచి ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం వచ్చిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలోని 62 మున్సిపాలిటీలు ఉండగా.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత పదేళ్లలో వాటి సంఖ్య 152కు పెరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినా.. అవసరమైన కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారుల పోస్టులు మాత్రం మంజూరు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం 42 కొత్త మున్సిపాలిటీలు కమిషనర్లు, ఏఈఈలు, టీపీఓలు లేకుండానే పనిచేశాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది అక్టోబర్ నెలలో మున్సిపాలిటీలకు అవసరమైన కమిషనర్ పోస్టులను మంజూరు చేసి వాటికి సంబంధించి నియామక ప్రక్రియ చేపట్టిందన్నారు. కమిషనర్లతోపాటు టౌన్ ప్లానింగ్ అధికారుల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం 165 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించిందన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలో పాత నిబంధనల ప్రకారం ఒక డీఈ, ఇద్దరు ఏఈఈలు ఉండాలని, కొత్త రూల్స్ ప్రకారం ఒక ఈఈ సైతం ఉండాలన్నారు. అయితే ఈ రోజు వరకు మున్సిపాలిటీలో ఒక్క ఏఈఈ లేరన్నారు. దీంతో అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ప్రస్తుతం ఒక్కో ఏఈఈ 6 మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్నారని, ఉమ్మడి జిల్లాలో 21 మున్సిపాలిటీలకుగాను ఇద్దరు డీఈలు, ఒక్క ఈఈ ఉన్నారన్నారు. రాష్ట్రంలో 5 ఉమ్మడి జిల్లాలకు ఒక ఎస్ఈ ఉన్నారని, సౌత్‌కు ఒకరు, నార్త్‌కు ఒకరు చొప్పున పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తాను అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ 453 ఇంజినీరింగ్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించిందన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధికి దోహదపడాలని ప్రభుత్వాన్ని కోరారు.

పంట వ్యర్థం.. నేలకు సారం


కడంపల్లి శివారులో పంట వ్యర్థాలను కాల్చిన దృశ్యం

- పంట వ్యర్థాలను తగులబెడుతున్న రైతులు
- సూక్ష్మ జీవులు నశించి భూమి సారం తగ్గే అవకాశం

కోస్గి: వరి పొలాల్లో కోతల అనంతరం పంట వ్యర్థాల కాల్చివేతతో కాలుష్యం తీవ్ర స్థాయిలో పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. శీతా, వేసవి కాలాల్లో వరి కొయ్యలను పొలాల్లోనే కాలుస్తుండటంతో గ్రామాల్లో వాతావరణం కాలుష్యం ఏర్పాడుతుంది. పంటలకు సంబంధించిన వ్యర్థాలకు నిప్పంటించడంతో భూమిలో ఉండి పంటలకు మేలు చేసే కీటకాలు, ఇతర సూక్ష్మ జీవులు నశిస్తాయి. అలా చేయకుండా రైతులు పంట అవశేషాలను భూమిలో కలియ దున్నితే భూమి సారం పెరిగి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు.

దున్నితేనే భూమికి మేలు..

సాధారణంగా పంట కోతల అనంతరం పంట వ్యర్థాలు పొలాల్లో మిగులుతాయి. వరి కోత అనంతరం గడ్డి, ఇతర పంటల్లో అడుగున ఉండే మొక్కల భాగాలు పొలంలోనే ఉంటాయి. వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నడం వల్ల భూసారం మరింత పెరుగుతుంది. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు. ఓ పరిశోధనలో పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో రైతులు పంట అవశేషాలను కాల్చివేయడంతోనే దేశ రాజధాని ఢిల్లీలో పొగ మంచుతో స్థానికులు రోగాల భారీన పడుతున్నారని అధికారులు నిర్ధారించారు. రైతులు పొలాల్లో పంటల వ్యర్థాలను, ఇతర వస్తువులను పొలాల్లో విచక్షణరహితంగా కాలుస్తుండటంతో వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్ , మిథేన్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులు విడుదలై మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అలా కాకుండా రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోని కలియ దున్నితే కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భూసారాన్ని మరింత పెంచుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

భూసారంతో పాటు దిగుబడులు పెరుగుతాయి



పొలాల్లో పంట వ్యర్థాలను భూమిలో కలియ దున్నితే సారం పెరగడంతో పాటు దిగుబడి సైతం పెరుగుతుంది. వ్యర్థాలు భూమిలో కలియడానికి సూపర్ పాస్పెట్ చల్లాలి. రైతులు పంట వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చివేయకూడదు.

– రామకృష్ణ, ఏఓ, కోస్గి

కుక్కల స్వైరవిహారం


కుక్కల దాడిలో గాయపడిన రెండేళ్ల చిన్నారి


చికిత్స పొందుతున్న బాలుడు


కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలైన చిన్నారి షోయబ్

హన్వాడ: వేపూర్‌లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. గురువారం ఉదయం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు, ఓ వ్యక్తిపై దాడి చేయడంతో బాధితులను ఆసుపత్రికి తరలించారు. షోయబ్ అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా రెండు కుక్కలు బాలుడిపై పడి విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాలుడుని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. అలాగే గొల్ల వెంట్రాములు అనే రెండేళ్ల చిన్నారిని కూడా కరవడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరితో పాటు మరో 15ఏళ్ల బాలుడు బహిర్భూమికి వెళ్లగా దాడి చేసి గాయపరిచాయి. ఒకే రోజు ముగ్గురిపై కుక్కలు దాడి చేయడంతో గ్రామస్థులు ఓ కుక్కను కర్రలతో కొట చంపేశారు. ఇబ్రహీంబాద్‌లో సైతం కుక్కలు రెచ్చిపోయి పలువురిని గాయపరిచాయి. అధికారులు దృష్టి సారించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లారీ ఢీ.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పీపన్‌గండ్ల మండల కేంద్రానికి చెందిన తిరుపతయ్య (46) పెబ్బేరు మండలం కంచిరావుపల్లికి బైక్ పై వచ్చి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో శ్రీ రంగాపురం మండల శివారులో ఎదురుగా వస్తున్న లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కాగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కుమారుడు గోపాలకృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బింగిదొడ్డి గ్రామంలో మరొకరు

మల్దకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బింగిదొడ్డికి చెందిన నర్సింహులు మరణించాడు. గ్రామానికి చెందిన నర్సింహులు బైక్‌పై అమరవాయి నుంచి బింగిదొడ్డి బయలుదేరాడు. మల్దకల్ కాలువ వద్దకు రాగానే అయిజ నుంచి గద్వాల వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తున్న నర్సింహులు తీవ్రంగా గాయపడగా గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ఆసుపత్రి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వారం రోజుల్లో పెళ్లి...

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్


శ్రీరామ్ నాయుడు (ఫైల్)

అయిజ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈసంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వడ్డేపల్లి మండలంలోని తనగలకు చెందిన శ్రీరామ్‌నాయుడు(28) హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ఆయనకు వివాహనం నిశ్చయమైంది. ఈ నెల 14వ తేదీన పెళ్లి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా.. పెళ్లి కోసం సెలవు తీసుకొని గ్రామానికి వచ్చాడు. బుధవారం అయిజ మండలంలోని కిష్టాపురం గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టగా..త్రివేణు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన శ్రీరామ్ నాయుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మృతి చెందాడు. వారం రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం నింపింది.

ప్రమాదవశాత్తు వడ్ల బస్తాలు దగ్ధం



ఉట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిల్వ చేసిన వడ్ల బస్తాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు తోక పెద్ద ఎల్లప్ప రెండు రోజులుగా 80 వడ్ల ధాన్యం బస్తాలను ఎండకు వేసి పొలం దగ్గర నిల్వ చేశాడు. గురువారం మధ్యాహ్నం వేల ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకొని వడ్ల బస్తాలకు వ్యాపించాయి. దీంతో 50 ధాన్యం బస్తాలలో 40 బస్తాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సలీం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ దుర్మరణం

నల్లగొండ జిల్లాలో ఘటన

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలంలో నల్లగొండ–గుండ్లపల్లి రహదారిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం యక్షాపురం గ్రామానికి చెందిన షేక్ మైబూషేన్(45) నల్లగొండకు వలస వచ్చి స్థానికంగా ఉంటూ.. నల్లగొండ నుంచి గుండ్లపల్లి వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మైబూషేన్ డీజిల్ సప్లయ్ చేసే వాహనం నడుపుకుంటూ గుండ్లపల్లి నుంచి నల్లగొండకు వస్తుండగా.. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పడంతో రహదారి పక్కన వ్యవసాయ భూమిలో ఉన్న సమాధులను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మైబూషేన్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గురువారం మృతుడి భార్య రమిజాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగారెడ్డి తెలిపారు.

అడవి పంది తగిలి బైక్ బోల్తా

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అడ్డాకుల: రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనానికి అడవి పంది తగలడంతో బైక్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన మూసాపేట మండలం సంకలమద్ది శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.వేణు కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లాలోని గుడిపల్లికి చెందిన శ్రీశైలం(28), పెద్దకొత్తపల్లి మండలకేంద్రానికి చెందిన నరేష్ మూసాపేట సమీపంలో హైవే పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ హన్మంత్ రెడ్డి వద్ద డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇద్దరు డ్రైవర్లు కలిసి ద్విచక్ర వాహనంపై వేముల రోడ్డు మీదుగా హైవే వైపు వస్తున్నారు. అదే సమయంలో రోడ్డు దాటుతున్న అడవి పంది ద్విచక్ర వాహనానికి తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కింద పడిపోయారు. దీంతో శ్రీశైలానికి తీవ్ర గాయాలు కాగా నరేష్‌కు తల, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి శ్రీశైలం చనిపోయినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. మరో డ్రైవర్ నరేష్‌కు ప్రాణాపాయం తప్పిందని చెప్పారు. మృతుడికి భార్య రేణుక ఉన్నట్లు తెలిపారు. దీనిపై బాధితులు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

పాలమూరు: జిల్లాలో ఉన్న అన్ని రకాల కోర్టులలో ఈనెల 9 నుంచి 14 వరకు చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు తప్పక ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లాకేంద్రంలో ఉన్న ప్రధాన కోర్టుతో పాటు జడ్చర్ల కోర్టులో సైతం ఈ లోక్ అదాలత్ కొనసాగుతుందని, ఆయా పరిధిలో కేసులు కలిగిన కక్షిదారులు హాజరై కేసులు పరిష్కారించుకోవాలని పేర్కొన్నారు.